ఘనంగా మహిళా దినోత్సవ వారోత్సవాలు

విశాలాంధ్ర - ఆనందపురం : ఐసిడిఎస్ భీమునిపట్నం ప్రాజెక్టు పరిధిలో ఆనందపురం మండలం వేములవలస గ్రామ పంచాయతీలో మహిళా దినోత్సవ వార్షికోత్సవం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పిల్లలతో సైకిల్ ర్యాలీ నిర్వహించి బేటి బచావో బేటి పడావో పెళ్లికి ఎందుకు తొందర చదువుకో ముందర బాలిక చదువు ఇంటికి వెలుగు, బాల్య వివాహాలు అరికట్టాలి. అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించి గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఐసిడిఎస్ సూపర్వైజర్ పివివి.రత్నం, ఆనందపురం మండల అంగ న్వాడి కార్యకర్తలు డి.కాసులమ్మ, పద్మ, రమణమ్మ, తల్లిదండ్రులు పిల్లలు పాల్గొన్నారు.

ముగిసిన అల్లు బాబురావు అంత్యక్రియలు.. ఘన నివాళులర్పించిన పార్టీ శ్రేణులు

విశాలాంధ్ర - విశాఖ : సిపిఐ, ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు కామ్రేడ్ అల్లు బాబురావు (78) అంత్యక్రియలు శనివారం చిట్టివలస స్మశాన వాటికలో ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సంతాప సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ కామ్రేడ్ అల్లు బాబురావు సిపిఐ, ఏఐటీయూసీ అభివృద్ధికి, కార్మికులు సంక్షేమానికి మరణించి నంత వరకూ విశేషంగా కృషి చేసిన ధన్యజీవి అని నివాళులర్పించారు. కామ్రేడ్ బాబురావు మృత దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించిన వారిలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడు చలసాని రాఘవేంద్రరావు, వైసీపీ నాయకుడు ముత్తంశెట్టి మహేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కె.సత్యనారాయణ, ఎస్కె రెహమాన్, పి.చంద్రశేఖర్, ఎం.మన్మధరావు, ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, ఏఐటీయూసీ నాయకులు కొండపు ఈశ్వరరావు, చిల్ల రాంపైడి, టీడీపీ నాయకులు గాదు వెంకటప్పదు, గంటా నూకరాజు, సిపిఎం నాయకులు అప్పలనాయుడు, భాగం లక్ష్మి, ఇస్కఫ్ నాయకుడు డి మార్కండేయులు, మహిళా సమాఖ్య నాయకురాలు ఎం.డి బేగం, స్థానిక అన్ని రాజకీయ పార్టీలు, కార్మికసంఘాల నాయకులు, సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు అంతిమ నివాళులర్పించారు.

నూతన ఈఓ (ఎఫ్.ఏ.సీ)గా సుబ్బారావు

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామి వారి నూతన పూర్తి అదనపు భాధ్యతలు ఫుల్ అడిషనల్ ఛార్జ్) కార్య నిర్వహణాధికారిగా కె సుబ్బారావు శనివారం భాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ఈయన డిప్యూటీ కలెక్టర్, రాజ మహేంద్రవరం రీజినల్ జాయింట్ కమిషనర్ జోన్-1లో విధులు నిర్వర్తిస్తున్నారు. మొన్నటి వరకు కార్యనిర్వహణాధికారి గా ఉన్న వి త్రినాధరావు మూడు నెలల సెలవు పై వెళ్తున్నారు. నూతనంగా వచ్చిన ఈఓ కు ఆలయ అధికారులు, అర్చక స్వాములు, సిబ్బంది పూల మాలలు వేసి ఘన స్వాగతం పలికారు. తొలుత ఆయన కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని స్వామివారికి తమ గోత్ర నామాలతో స్వామివారికి సంకల్పం చెప్పించారు. పిదప వేద పండితులు ఆశీర్వచనం పలికారు. అనంతరం ఈఓ గా దస్త్రాల పై చేవ్రాలు చేసారు. ఆలయ అధికారులు స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్ర పతం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఏయూ నూతన ఉపకులపతిని కలిసిన ఏఐఎస్ఎఫ్ బృందం

విశాలాంధ్ర - విశాఖపట్నం : ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) బృందం ఆంధ్ర విశ్వవిద్యాలయం నూతన ఉప కులపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ జీ.పి రాజశేఖర్ ని మర్యాదపూర్వకంగా కలిసి భగత్ సింగ్ జీవిత చరిత్ర పుస్తకాన్ని అందజేసి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు. నాగరాజు మాట్లాడుతూ ఖరగ్ పూర్ ఐఐటిలో మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్ చేస్తూ విద్యావ్యవస్థలో ఎంతో అనుభవం కలిగిన ప్రొఫెసర్ ఇదే ప్రాంతానికి చెందిన వ్యక్తి ఆంధ్ర యూనివర్సిటీ ఉప కులపతిగా బాధ్యతలు స్వీకరించడాన్ని స్వాగతిస్తున్నాం అన్నారు. యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు భవిష్యత్తులో వీసీ ముందుకు తీసుకొస్తామని తెలియజేశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ విభాగ కార్యదర్శి జే.అభిషేక్, సహాయ కార్యదర్శి పవన్ కళ్యాణ్, నాయకులు శివ రాజ్ ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ బడ్జెట్లో దళితులను దగా చేసిన కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఎస్సీ ఎస్టీలకు కేటాయింపులు పెంచాలని రాష్ట్ర దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్ పిఎస్) డిమాండ్ చేసింది. అంబేద్కర్ భవన్లో జరిగిన సమావేశంలో డిహెచ్ పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ మాట్లాడుతూ బడ్జెట్ 3.25 లక్షల కోట్లు ప్రవేశపెట్టారని, దళితులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు 45 వేల కోట్లు గిరిజనులకు 22 వేల కోట్లు కేటాయింపులు జరగాల్సి ఉందన్నారు.దళితులకు రూ10900 కోట్లు, గిరిజనులకు 4307 కోట్లు కేటాయించారన్నారు.ఇంకా 35 వేల కోట్లు కేటాయించాలన్నారు. గత ప్రభుత్వం రద్దు చేసిన 29 పథకాలను పునరుద్ధ రించాలన్నారు. వివాహాలు విదేశీ విద్యా పథకాల ప్రస్తావన లేదన్నారు. స్టడీ సర్కిల్ జూన్ నుంచి మూతబడింది, ఎస్సీ కార్పొరేషన్కు తగిన నిధులు కేటాయించాలన్నారు.డిహెచ్ పిఎస్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ రాజులు, జి రాజబాబు, మధు, కిషోర్, ప్రసాద్, కామేశ్వరరావు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో అన్ని వర్గాలకు దగా : మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ : బడ్జెట్‌లో అన్ని వర్గాల వారికి ప్రభుత్వం దగా చేసిందని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ విమర్శించారు. శనివారం వైయస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై విమర్శనాస్త్రాలు సంధించారు. అది బడ్జెట్ ప్రసంగం కాదు లోకేష్‌ను పొగిడే కార్యక్రమం అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు వంచన, మోసాలకు ప్రతిరూపంగా బడ్జెట్ నిలుస్తుందన్నారు. పాలన చేతకాక ఏడాదిలోపే చంద్రబాబు చేతులెత్తేసారని, అప్పుల గురించి బడ్జెట్‌లో చెప్పుకోలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు తెచ్చుకోలేని అసమర్థుడు చంద్రబాబు పాలనపై ప్రజల్లో ఇప్పటికే అసహనం మొదలైందన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ చంద్రబాబు మార్క్ వంచన, మోసానికి ప్రతిబింబంగా ఉందని, ప్రభుత్వంపై ఆధారపడిన పేద బలహీనవర్గాల జీవన ప్రమాణాలు పెంచే విధంగా ఈ బడ్జెట్ కనిపించడం లేదన్నారు. అమరావతి అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.6 వేల కోట్లు కేటాయించి, రాష్ట్రంలో వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ హామీల్లోని ఫ్రీబస్, ఆడ బిడ్డ నిధి, నిరుద్యోగ భృతి వంటి పథకాలను పూర్తిగా విస్మరించిన ప్రభుత్వం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు అరకొర నిధులు కేటాయించడం ద్వారా, వాటి అమలుపైనా అనుమానాలు వస్తున్నాయని తెలిపారు. చంద్రబాబు 9 నెలల పాలనపై ఇప్పటికే ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత మొదలైందని, అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారన్నారు.

ఏయూ వీసీగా ఆచార్య రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - విశాఖపట్నం : ఆంధ్ర విశ్వ విద్యాలయం నూతన ఉపకులపతిగా ఆచార్య జీ.పి రాజశేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం పరిపాలన భవనం లోని వైస్ చాన్సలర్ కార్యాలయంలో ఆయన లాంచలంగా బాధ్యతలను చేపట్టారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చేరుకున్నాయన ముందుగా మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, వర్సిటీ వ్యవస్థాపక ఉప కులపతి కట్టమంచి రామలింగారెడ్డిల విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు ప్రిన్సిపాల్స్ ఇతర అధికారులు పాల్గొన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ఏయూ కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్లు ఇతర అధికారులతో అకడమిక్ సెనేట్ మందిరంలో సమావేశం అయ్యారు.

సమిష్టిగా పని చేద్దాం... అభివృద్ధి దిశగా నడిపిద్దాం....

ఆంధ్ర విశ్వవిద్యాలయాలు ఆచార్యులంతా సమిష్టిగా పనిచేస్తూ ఏ.యు ని అత్యుత్తమంగా తీర్చిదిద్దడం భాగం కావాలని వైస్ ఛాన్సలర్ ఆచార్య రాజశేఖర్ పిలుపునిచ్చారు. పదవి బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన ప్రిన్సిపాల్స్, డీన్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యతే మన బలమని చెప్పారు. కేంద్రీయ విద్యాసంస్థల కన్నా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంతో పెద్దదని అన్నారు. ఎందరో మహనీయులు కృషి, స్ఫూర్తి ఫలితంగా నేడు యూనివర్సిటీ ఎంతటి ఉన్నత స్థానాల్లో నిలిచిందని చెప్పారు. అందరి సహకారం, ఆశీస్సులు తనకు కావాలని కోరారు. ప్రభుత్వం తనకి బాధ్యతను అపగించిందని అన్నారు. పదవుల కంటే అకడమిక్స్ ఎంతో ప్రధానమని చెప్పారు. ఈ ప్రక్రియలో చాలా సవాళ్లు ఉన్నాయని, విద్య లో అనేక సంస్కరణలు చోటు చేసుకుంటాయని చెప్పారు.

అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన ఏపీ బడ్జెట్

బీజేపీ పెందుర్తి కన్వీనర్ గొర్లె రాము నాయుడు

విశాలాంధ్ర - పెందుర్తి : 2025-2026 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆమోద యోగ్యమైనదని భారతీయ జనతా పార్టీ పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలకు నిధులు కేటాయించడంతో పాటు భవిష్యత్ అవసరాల దృష్ట్యా అన్ని రంగాలకు భారీ స్థాయిలో నిధులు కేటాయించడం హర్షదాయకమని తెలిపారు. ప్రత్యేకించి ఆక్వా రంగ రైతులకు విద్యుత్ యూనిటుకు 1.5 తగ్గించుట వ్యవసాయ రంగానికి, టూరిజం రంగానికి ప్రత్యేకించి ఇరిగేషన్, గ్రామీణాభివృద్ధి రంగానికి భారీగా నిధులు కేటాయించడం, రైతులు, మహిళలు, యువత అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ రాష్ట్ర సర్వతోముఖా భివృద్ధికి దోహద పడే విధంగా ప్రజారంజక బడ్జెట్‌ను రూపొందించారని రాము నాయుడు స్పష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమానికి పెద్దపేట వేశారని అదే సమయంలో అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. బడ్జెట్లో యువతకు ఉపాధి, సంపద సృష్టికి అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయని వెల్లడించారు.

శరత్ స్కూలులో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

విశాలాంధ్ర - పెదగంట్యాద : ఈ రోజు సైన్స్ దినోత్సవం సందర్భముగా పెద గంట్యాడలోని శరత్ పబ్లిక్ స్కూల్ నందు ప్రిన్సిపాల్ రాము మాస్టర్ గారి ఆధ్వర్యములో పిల్లలు సైన్స్ ఎగ్జిబిషన్ ను నిర్వహించారు. వివిధ రకములైన 200 పైగా సైన్స్ ప్రాజెక్ట్ పిల్లలు ప్రద ర్శించారు. ఈ కార్యక్రమాన్ని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి రెడ్డి అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భములో ఆయన మాట్లాడుతూ నేటి పిల్లలు అందరూ బాగా అర్థం చేసుకుంటూ చదువుకొని దేశ అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గంట్యాడ గురుమూర్తి, మొల్లి అప్పారావు, ములకలపల్లి రమణ, దొమ్మేటి సోమ నాయుడు, పులి అప్పల రెడ్డి, ఊరుకూటి అప్పల రాజు ఇతరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ఐటిలో టెక్నిమ్బుల్ -2025

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనందపురం మండలంలోని సొంట్యాం నడింపల్లి సత్య నారాయణ రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో టెక్నిమ్బుల్ 2025 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇందిరా గాంధీ ఢిల్లీ టెక్నికల్ యూనివర్సిటీ ఫర్ విమెన్, ఢిల్లీ లోని సీఎస్ఈ విభాగ అధిపతి ప్రొఫెసర్ రామ్ నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆలోచనల పట్ల ఆసక్తిని పెంపొం దించేందుకు టెక్నిమ్బుల్ 2025 కార్యక్రమం ఎంతో దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి విశాఖ పట్నంలోని వివిధ కళాశాలల నుండి 500కుపైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఉత్సవంలో విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే పలు పోటీలు, ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి, అందులో ముఖ్యంగా పేపర్, పోస్టర్ ప్రదర్శనలు, టెక్నికల్ క్విజ్, ఐడియథాన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, కోడ్ విన్యాసం టెక్నికల్ ట్రెజర్ హంట్,బ్రిడ్జ్ బస్ట్,స్టార్టప్ ఐడియా మోడలింగ్, 3డి ప్రింటింగ్ అందరు విభాగాధిపతులు ఉత్సాహంగా పాల్గొని తమ విభాగాల స్థాయిలో ఈ కార్యక్రమాలను విజయ వంతంగా నిర్వహించారు. ప్రఖ్యాత విద్యా సంస్థల నుండి ఆహ్వానించబడిన న్యాయనిర్ణేతలు పోటీ దారుల ప్రతిభను అంచనా వేసి ప్రామాణికతను పెంచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శంభు ప్రసాద్, సిఎమ్ఓ డాక్టర్ పి.ఎస్. రాజు, కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎన్. ప్రసాద రాజు విద్యార్థులు, నిర్వాహకులను అభి నందించారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలను పరిశీలించడానికి, సాంకేతికతపై లోతైన అవగా హనను పెంపొందించడానికి ప్రోత్సహించారు.

విద్యతో పాటూ క్రీడా సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలి

విశాలాంధ్ర - కొమ్మాది : గాయత్రీ విద్యా పరిషత్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో క్రీడలు మరియు సాంస్కృతిక దినోత్సవం-2025 ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అల రించాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 'ది నైటింగేల్' 'మెలోడీ క్వీన్' డాక్టర్ పంతుల రామ (కర్ణాటక సంగీతం). హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..... కళాశాలలో జరిగే అన్ని రకాల కార్యక్రమాలలో విద్యార్థు లందరూ భాగస్వాములు కావాలని, చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్య క్రమాలు జీవితంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని అన్నారు. డి.దక్షిణ మూర్తి, ఉపాధ్యక్షులు మరియు ప్రొఫెసర్ పి.సోమరాజు, సెక్రటరీ... విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు ఇతర సాంకేతిక కార్యక్రమాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రొఫెసర్ ఎ.బి.కె.రావు, ప్రధానోపాధ్యాయులు, డీన్లు, హెచ్వోడీలు,ఉపాధ్యాయులు మరియు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా ర్యాలీ

విశాలాంధ్ర - పెందుర్తి : అంత ర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పెందుర్తి విక్టరీ పబ్లిక్ స్కూల్ కిషోర్ బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల హక్కులు గురించి బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పెందుర్తి ఐసిడిఎస్ ప్రాజెక్టు సీడీపీఓ నీలవేణి మాట్లాడుతూ ఈనెల 1 నుండి ఎనిమిది వరకు మహిళా దినోత్సవాలు జరుపు కుంటున్నట్లు తెలిపారు. అనంతరం కిషోర్ బాలికలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా సూపర్వైజర్ గీతా లక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది దేవి, వరలక్ష్మీ, భవానీ, సుజన తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి స్టార్ డమ్ స్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

విశాలాంధ్ర - గాజువాక : అగనంపూడి పునరావాస కాలనీ సెక్టర్ 3 స్టార్ డం స్కూల్లో ఒకటో తరగతి నుండి పదవతరగతి వరకు విద్యార్థి విద్యార్థులు ఏర్పాటుచేసిన 153 స్టాల్స్ ఎగ్జిబిషన్ శంభంగి రామకృష్ణ ప్రారంభించారు స్టాల్స్ ని సందర్శించి అనంతరం ఆయన ప్రసంగిస్తూ భవిష్యత్తులో ప్రజానీకానికి ఉపయోగపడే అంశాలను విద్యార్థుల్లో ఉన్న మేధాశక్తితో శాస్త్రీయంగా తయారు చేయుటకు ఇటువంటి ఎగ్జిబిషన్సు ఎంతో దోహదపడతాయని అన్నారు. భారతరత్న నోబెల్ బహుమతి గ్రహీత సివి రామన్ మేధాశక్తితో భారతదేశంలో ఎన్నో అబ్బురు పరిచిన శాస్త్రీయంగా చేసిన అంశాలు ఉన్నాయని అన్నారు. భవిష్యత్తులో సమాజంలో బొగ్గు నీటికి ఇబ్బంది పడుట వలన విద్యుత్తు సాధ్యము కాదని కావున ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన రాష్ట్ర సీఎం డిప్యూటీ సీఎం బలపరుస్తున్న ప్రధానమంత్రి సూర్యగర్ యోజన సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోండి విద్యుత్ బిల్లు తగ్గించుకోవడానికి ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఏడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ మ్యాథమెటిక్స్ లో పురావణ్యత కలిగిన ఎస్ రంగారావు నేతృత్వంలో అగనంపూడి బీసీ కాలనీ మంగలిపాలెం దేశపాత్రునిపాలెం గొర్లివానిపాలెంలో స్కూలు బ్రాంచ్ లు పెట్టి విద్యార్థులకు అన్ని రంగాల్లో ప్రావీణ్యత కలిగించేటట్టు విద్యా బోధన చేయడం అభినందినీ యమని అన్నారు. స్టార్ డం పాఠశాల కరస్పాండెంట్ ఎస్.రంగారావు సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ నాగభూషణ్ అగనంపూడి ఆర్ఈసిఎస్ సెక్షన్ ఏఈ జే రామకృష్ణ సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ తమరాని శ్రీనివాసరావు పాఠశాల ఉపాధ్యాయులు వి వెంకటలక్ష్మి పి.సరస్వతి జి గౌతమి కే సుశినిత డి.శ్రీదేవి ఎం చిన్ని పి అనూష ఏ వనజ తోటాడ మౌళి విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. వారి పిల్లలు తయారు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్లో స్టాల్స్ ను ప్రజెంటేషన్ చూసి వారి తల్లిదండ్రులు ఎంతో ఆనందించారు.

అన్నీ వసతులు ఉన్నా... మాతాశిశు మరణాలు ఎందుకు సంభవిస్తున్నాయి...!

వైద్యాధికారులను ప్రశ్నించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : అన్ని రకాల సదుపాయాలు, వసతులు, ఆధునిక సాంకేతిక వైద్య పరిజ్ఞానం ఉన్నప్పటికీ మాతాశిశు మరణాలు ఎందుకు సంభవిస్తు న్నాయని వైద్యాధికారులను, సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూటిగా ప్రశ్నించారు. గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది జనవరి మధ్య కాలంలో జిల్లాలోని వివిధ ఆసుపత్రుల పరిధిలో చోటుచేసుకున్న మాతాశిశు మరణాలపై శనివారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన సమావేశంలో ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. ఒక్కొక్క ఘటన తాలూక పూర్వపరాలను తెలుసుకున్నారు. ఈ నాలుగు నెలల కాలంలో మొత్తం ఎనిమిది దుర్ఘటనలు చోటు చేసుకున్నాయని, అందులో ఐదుగురు తల్లులు, ముగ్గురు పిల్లలు వివిధ అనారోగ్య కారణాలతో మృత్యువాత పడ్డారని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి పి. జగదీశ్వరరావు వివరించారు. ఆయా రోగుల విషయంలో వైద్యులు పాటించిన నియమాలు, తీసుకున్న చర్యలు, ఇతర అంశాల గురించి కలెక్టర్ కు నివేదించారు. నాలుగు నెలల కాలంలో సంభవించిన మాతాశిశు మరణాలపై కలెక్టర్ స్పందిస్తూ... ఆధునిక వసతులు ఉన్నప్పటికీ ఇలా జరగటం శోచనీయమని విచారం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కావడానికి వీల్లేదని నిర్దేశించారు. రోగుల స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, దానికి తగ్గ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లాలోని ఆధునిక వసతులు కలిగిన ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులు ఉన్నాయని, ఇలాంటి చోట మనుషుల్ని కోల్పోవడం బాధాకరమని, దీనిపై వైద్యాధికారులు, సిబ్బంది పునఃపరిశీలన చేసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అందించే వైద్యపరమైన సేవలపై ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు కచ్చితంగా తెలియపరచాలని వైద్యాధికారులను ఆదేశించారు. అలాగే రోగితో పాటు వచ్చే సహాయకులకు కూడా అన్ని విషయాలు తెలియపరచాలని, మెడికేషన్ పై అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రయివేటు ఆసుపత్రుల నిర్వాహకులు, వైద్యులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఉండే సిబ్బంది గ్రామ, వార్డుల పరిధిలో నూతనంగా వివాహం చేసుకున్న మహిళలను ముందుగానే కలిసి, ఇలాంటి అంశాలపై కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని, భవిష్యత్తులో మాతాశిశు మరణాలు సంభవించకుండా జాగురూకతతో వ్యవహరించాలని, సేవలను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి పి.జగదీశ్వరరావు, డీఐవో లూసీ, డీసీహెచ్ఎస్ శంకర్ ప్రసాద్, డీఎంవో తులసి, ఎన్.టి.ఆర్. వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ అప్పారావు, కేజీహెచ్, వివిధ ప్రయివేటు ఆసుప్రతుల వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆక్సఫర్డ్ స్కూల్లో సైన్స్ ఫెయిర్



విశాలాంధ్ర - పెదగంట్యాద : ప్రిన్సిపల్ వెంకునాయుడు మాట్లాడుతూ సివి రామన్ గారు చేసిన కృషి చాలా ఉన్నతమైందని అన్నారు. ప్రిన్సిపల్ నాయుడు మాట్లాడుతూ సి.వి.రామన్ భారతదేశానికి చెందిన భౌతిక శాస్త్రవేత్త. రామన్ ఎఫెక్ట్‌ను కనిపెట్టారు. 1930 డిసెంబరులో రామన్‌కు నోబెల్ బహుమతి వచ్చింది. 1954లో భారత ప్రభుత్వం అతనిని భారత రత్న పురస్కారంతో సత్కరించారు అన్నారు. అతని పరిశోధన ఫలితాన్ని ధ్రువపరిచిన రోజును (ఫిబ్రవరి 28) జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. ఈ కార్య క్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు టీచర్లు శారదా, తేజస్విని, పావని నాగలక్ష్మి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం మేధావులు బడ్జెట్

రాష్ట్ర కోపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవెర్స్ ఫెడరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి

విశాలాంధ్ర - విశాఖ సిటీ : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేధావుల బడ్జెట్ అని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో మేధావులు బడ్జెట్ ప్రేవేశపెడితే వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫ్యాక్షనిస్టులు బడ్జెట్ ప్రవేశపెట్టారని ఎద్దేవా చేశారు . బడ్జెట్ లో విశాఖ కు 12 నుంచి 14 వందల కోట్లు కేటాయించారని ఆనందం వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా 2025-26 బడ్జెట్‌ను రూపకల్పన చేశారని ప్రశంసించారు. 2026వ సంవత్సరం చివరికి పోలవరం ప్రాజెక్ట్ పూర్తి అవుతుందని, జగన్ గత ఐదేళ్లలో అభివృద్ధి ప్రక్కనపెట్టి కేవలం బట్టన్ నొక్కడనికే పరిమితం అయ్యారని ఎద్దేవ చేశారు. డబల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందన్నారు. విశాఖ మెట్రో ప్రాజెక్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి అని అన్నారు. బడ్జెట్ కేటాయింపులు పై మాజీ మంత్రి అమర్నాథ్‌కు అవగాహన లేదు అని పేర్కొన్నారు. సమా వేశంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గొంపా సత్యనారాయణ, ఉత్తర నియోజకవర్గం టీడీపీ నాయకులు వెల్లంకి భరత్ పాల్గొన్నారు.

పగడ్బందీగా పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనందపురం మండలంలో 95.55% పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో డాక్టర్ వి. జానకి పేర్కొన్నారు.

ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మొత్తం పెన్షన్లలో 95.55% పంపిణీ పూర్త య్యిందన్నారు. మండలంలోని మొత్తం 8,224 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 3,49,86000/-ల సాంఘిక భద్రత పెన్షన్లు పంపిణీ చేయబడినట్లు మిగిలిన పెన్షన్లు సోమవారం 2న పంపిణి చేయ నున్నట్లు తెలిపారు. గంభీరం గ్రామ పంచాయతీ లో ఎంపీడీవో జానకి పెన్షన్ పంపిణీని తనిఖీ చేశారు. పింఛనుదారుల ఇంటి దగ్గర నుంచి 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో పింఛను పంపిణీ జరిగినప్పుడు పింఛనుదారుల ఇంటి నుండి పంపిణీ చేయు ప్రదేశం మధ్య దూరం మొబైల్ అప్లికేషన్లో చూపించడం జరిగినది. పింఛను పంపిణీ చేసే అధికారులు 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో పింఛను పంపిణీ చేయదలచిన కారణాలను మొబైల్ అప్లికేషన్లో నమోదు చేసి పింఛను అందజేశామని అన్నారు.

జేవీఎస్ఎన్ అరెస్టులో పోలీసులు తీరు దారుణం : సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు

విశాలాంధ్ర - పెందుర్తి : సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి పట్ల పోలీసులు అతిగా ప్రవర్తించారని, ప్రజల కోసం పోరాడిన వ్యక్తి అరెస్టులే దారుణంగా వ్యవహ రించారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసరావు ఆవేదన వెలిబుచ్చారు. శనివారం సిపిఐ జిల్లా సమితి సభ్యులు వై. రాంబాబు, పెందుర్తి శాఖ కార్యదర్శి ఎన్. అసిరి నాయు డులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో గోపాలపట్నం సమీపంలోని ఎల్జీ పాల్మర్స్ కంపెనీ విషవాయువులు వెదజల్లడంతో వందలాది మంది ప్రజలు తీవ్ర అస్వస్థకు గురైనారని, పలువురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ ఘటనపై కంపెనీ యాజమాన్య వైఖరిని నిరసిస్తూ, బాధితులకు న్యాయం చేయాలన్న డిమాండుతో జేవి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో సీపీఐ శ్రేణులు ఆందోళన చేపట్టినట్లు గుర్తు చేశారు. అయితే కరోనా నిబంధనలు ఉల్లంఘించారంటూ అప్పట్లో పోలీసులు సత్యనారాయణమూర్తి పై కేసు నమోదు చేయగా, అప్పటినుండి ఈ కేసు పెండింగ్ లో ఉందని తెలిపారు. పెండింగ్ కేసులు పరిష్కారం అంటూ పోలీసులు సత్యనారాయణ మూర్తిని స్టేషన్ కు పిలిపించి శుక్రవారం ఆయన్ను గోపాలపట్నం, పెందుర్తి పోలీస్ స్టేషన్లో తిప్పి సాయంత్రం కోర్టుకు తరలించి రిమాండ్‌కు పంపించారని ఆవేదన వెలిబుచ్చారు. శనివారం, ఆదివారం కోర్టుకు సెలవులు అన్న సంగతి తెలిసినప్పటికీ ప్రజా సమస్యలపై పోరాడిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు పట్ల పోలీసులు దారుణంగా వ్యవహ రించారని మండిపడ్డారు. కేసు పరిష్కారం అని పిలిచి జైలుకు పంపించారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు విచారకరమని వాపోయారు. ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులు ఇలాంటి నిర్బంధాలకు భయ పడరని ప్రజల కోసం ఎల్లప్పుడు పోరాటం చేస్తూనే ఉంటారని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సత్యనారాయణమూర్తి పట్ల పోలీసులు వ్యవహార శైలిని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సింహాద్రి నాధుని దర్శించుకున్న ఏయూ వీసీ

విశాలాంధ్ర - గోపాలపట్నం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారిని ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జిపి రాజశేఖర్, సినీ నటీ అంజలి బృందం శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ సహాయ కార్యనిర్వహణ అధికారి ఆనంద కుమార్, సీనియర్ సహాయకులు వి సూర్యనారాయణ శ్రీ స్వామి వారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

విద్యా వికాసానికి కంటిచూపు ప్రాముఖ్యమైనది

విశాలాంధ్ర - కొమ్మాది : విద్యార్థుల విద్యా వికాసానికి కంటిచూపు ప్రాముఖ్యమైనదని విద్యార్థులకు ప్రతి ఏడాది కంటి పరీక్షలు నిర్వహించి కావలసిన వైద్యంతో పాటు కంటి అద్దాలను ఇష్టంగా అందజేయడం విద్యార్థుల చదువును ప్రోత్సహించడమేనని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చంద్రంపాలెం ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి అన్నారు. విశాఖ పట్నం జిల్లా ప్రాంతీయ నేత్ర వైద్య ఆసుపత్రి మరియు విశాఖ నేత్ర వైద్య ఆసుపత్రిలో సహకారంతో అక్టోబర్ నెలలో చంద్రంపాలెం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వైద్య పరీక్షల ఆధారంగా 68 మంది విద్యార్థులకు శనివారం కళ్లజోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రాంతీయనేత్ర వైద్యశాల ప్రతినిధి కళ్ళజోళ్ళని తీసుకువచ్చి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ద్వారా అందజేశారు.

ఘనంగా విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఫేర్వెల్ పార్టీ ఘనంగా నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులకు. 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. వీడ్కోలు కార్యక్రమంలో విద్యార్థి విద్యార్థినుల పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాఠశాల మాజీ చైర్మన్ చందక అప్పలనాయుడు గౌరవంగా ఉపాధ్యాయులు, కోపరేటివ్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు చందక సూరిబాబు చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గతంలో అప్పలనాయుడు చైర్మన్గా ఉన్నప్పుడు చాలా అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో చేశారు. పాఠశాలకు అవసరమైనప్పుడల్లా తన వంతు అంతా సహాయం చేశారని గుర్తు చేసుకున్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది. ప్రధానోపాధ్యాయులు. విద్యార్థి విద్యార్థినిలు పాల్గొన్నారు.

వెంకటాద్రిపై వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు

విశాలాంధ్ర - పెందుర్తి : ఉత్తరాంధ్ర తిరుపతిగా భాషిళ్లతున్న పెందుర్తి వేంకటాద్రి కొండమీద, లక్ష్మీ అమ్మ వారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమైనాయి. శనివారం విస్వక్షేన ఆరాధన, పుణ్యాహవచనం నిర్వహించి లక్ష్మీ అమ్మవారి శ్రీ సూక్త సహిత కుంకుమ పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు మహార్తి రామనుజాచార్యులు తెలిపారు. స్వామివారిని ఉదయమే మేల్కొలిపి, సుప్రభాత సేవ, తోమాల సేవ చేసి, అనంతరం సహస్ర నామార్చన, అష్టోత్తరం, దూపసేవ, దీపోత్సవం జరిపించినట్లు ఆయన చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా, అందరికీ ఉచిత ప్రసాద వితరణ జరిపించామన్నారు. కొండ దిగువ నుండి స్వామి సన్నిధి వరకు ఉచిత వాహన సదుపాయం కల్పించినట్లు అధికారులు తెలియజేశారు.

ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి ఐపీఎస్ గారు అదేశించారు.శనివారం ఉదయం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు నేపథ్యంలో శ్రీకాకుళం నగరంలో ప్రభుత్వ మహిళ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఇంటర్మీడియట్ వ్రాత పరీక్షలలో అభ్యర్థులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు విధులు నిర్వర్తించాలన్నారు. పరీక్షలు పూర్తయ్యేవరకు అధికారులు మరియు సిబ్బంది అందరు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అభ్యర్థులకు నిర్దేశించిన సమయం లోపు కేంద్రాలలోనికి అనుమతించాలన్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి సెల్ఫోన్లు, స్మార్ట్ వాచెస్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతికి వీల్లేదని అన్నారు.పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున అభ్యర్థులు మినహా ఇతరులను అనుమతించరాదు అని సూచించారు.పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు పరీక్షలు ముగిసిన వరకు తెరవడానికి వీలు లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. అభ్యర్థులు మాస్ కాపీయింగ్,మాల్ ప్రాక్టీస్ వంటి పాల్పడుకుండా పరీక్ష నిర్వాహకులు,అధికారులు సమన్వయంతో పటిష్టంగా విధులు నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద అప్రమత్తంగా బందోబస్తు విధులు నిర్వర్తించాలని పోలీసు అధికారులు, సిబ్బంది జిల్లా ఎస్పీ సూచించారు.

జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : శ్రీకాకుళం గ్రామీణ మండలం, తండేవలసలో ఉన్న జిల్లా పోలీసు శిక్షణా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి ఐపీఎస్ గారు శనివారం సందర్శించారు. జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో ట్రైన్ పోలీస్ కానిస్టేబుల్ రానున్న రోజుల్లో శిక్షణ పొందేందుకు శిక్షణ కేంద్రంలో మైదానం, మౌలిక వసతులు పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలనీ జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. శిక్షణా కేంద్రంలో మైదానాన్ని, తరగతి గదులు,బ్యారెక్స్, మంచి నీటి సరఫరా, భోజనం,స్నానపు గదులు ఇతర మౌలిక సదుపాయాలు, వసతులు ను జిల్లా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శిక్షణ నిమిత్తము అవసరమగు వస్తుసామగ్రి, మౌలిక సదుపాయాలు వివరాలను అదేవిధంగా ఎటువంటి మరమ్మతులు ఉన్న యెడల తక్షణమే ప్రతిపాదనలు జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని సంబంధిత అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు.సిబ్బంది వివరాలు పై ఆరా తీసి శిక్షణ కేద్రంలో తరగతి గదులను, భోజనం గదులను,బ్యారక్ లను,స్నానపు గదులను పరిశీలించి అదనంగా చేయవలసిన ఏర్పాట్లు గురించి అదనపు ఎస్పితో కలిసి జిల్లా ఎస్పీ గారు అధికారులకు పలు సూచనలు చేశారు.శిక్షణ కేంద్రంలో పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ వెంట ఆదనపు ఎస్పీ కెవి రమణ,సీ.ఐ.కృష్ణ మూర్తి, ఆర్ఐ నర్సింగా రావు, పోలీస్ హౌసింగ్ ఏ.ఈ. తరుణ్, ఎస్సై రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు కామ్రేడ్ బాబురావుకు కన్నీటి వీడ్కోలు

విశాలాంధ్ర - తగరపువలస : యువజన సమైక్య నాయకుడిగా రాజకీయ ప్రస్తావాన్ని ప్రారంభించిన కామ్రేడ్ అల్ల బాబురావు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా , ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా, చిట్టివలస జ్యూట్ లేబర్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం కార్మిక వర్గానికి ప్రజాలు వారి హక్కుల సాధనకు అనేక ఉద్యమాలు లో కీలక పాత్ర వహించారు అని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టివలస లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పడాల రమణ గుర్తు చేశారు. మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో అనేక వడదెడుకులను ఎదుర్కొని ఒకవక్క ఆర్థిక సమస్యలు నప్పడికి తాను నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస విడిచే వరకు జండా పట్టి జనంలో బ్రతికిన నిజమైన ఎర్రజెండా ముద్దుబిడ్డ కామ్రేడ్ అల్లు బాబురావు అని అన్నారు. శనివారం ఉదయం కామ్రేడ్ బాబురావు నివాసం వద్ద అంతిమయాత్ర ప్రారంభానికి ముందు ఆయన పూల మాలలు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కొండపేట స్మశాన వాటి వరకు అంతిమయాత్ర కొనసాగింది చిట్టివలస లేబర్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిహెచ్ రాఘవేంద్రరావు, మాజీ ఎంపీపీ గాదు వెంకట అప్పడు, అవంతి కళాశాల డైరెక్టర్ అవంతి మహేష్. వార్డు కార్పొరేటర్ వైఎస్ఆర్ సీపీ నాయకులు. అక్రమాని రామనాయుడు. టిడిపి పట్టణ అధ్యక్షులు. కార్పొరేటర్. గంట నూకరాజు. మాజీ కౌన్సిలర్లు. పిట్టా సురేష్. మావూరి సన్యాసమ్మ సింగిడి అప్పారావు ఎం.వి గురుమూర్తి. వైయస్సార్ టియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ . జీరు వెంకటరెడ్డి. ప్రధాన కార్యదర్శి చిల్ల వెంకటరమణ.. కాంగ్రెస్ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్. దల్లి అప్పల రెడ్డి. ఎం ఆదినారాయణ. సిఐటియు నాయకులు ఎస్ అప్పలనాయుడు. భాగం లక్ష్మి టిఎన్టియుసి. వర్కింగ్ ప్రెసిడెంట్. నర్వ రామారావు. సాడి అచ్చారావు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు. ఎం మన్మధరావు. నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ.రెహమాన్. కోట సత్తిబాబు. పడాల గోవిందు పి చంద్రశేఖర్. మహిళా సమైక్య రాష్ట్ర అధ్యక్షురాలు ఏ విమల , స్థానిక సిపిఐ. ఏఐటియుసి నాయకులు కానరి రాంబాబు. చిల్ల. రాంపైడి. ఎరుషు అప్ప నరసయ్య.. మోర అప్పలరాజు. నూలు ఆదినారాయణ. నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్ ద్వారా మిలీనియం నుండి 27 మంది విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - విశాఖపట్నం : భారతదేశంలో డిజిటలైజేషన్ పెరుగుదలతో, గత 12 నెలల్లో క్యాంపస్ నియామకాల్లో నైపుణ్యాలకు డిమాండ్ 10-15 శాతం పెరిగిందని మిలీనియం సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సెంట్రల్ మేనేజర్ వరద రవికుమార్ పేర్కొన్నారు. మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్, భార్గో ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్తో కలిసి విశాఖపట్నంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్లో పైథాన్/జావా/నెట్లో మంచి నైపుణ్యం కలిగిన దాదాపు 225 మంది బి.టెక్ (ఫ్రెషర్లు/గ్రాడ్యుయేట్లు అసోసియేట్ సాఫ్ట్వేర్ ఇంజనీర్ పదవి కోసం శనివారం పాల్గొన్నారని ఆయన వివరించారు. ఎంపికైన 45 మంది అభ్యర్థులలో 27 మంది మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి వచ్చారన్నారు. మిలీనియం ఎల్లప్పుడూ విద్యార్థులకు అధునాతన టెక్నాలజీలపై శిక్షణ ఇవ్వడం ద్వారా వారి నైపుణ్యాలను మెరుగుపరచడంపై దృష్టి సారిస్తుందని ఆయన ప్రకటించారు. గతవారం యలమంచిలి సాఫ్ట్వేర్ ఎక్స్పోర్ట్స్తో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్లో 25 మంది విద్యార్థులు ప్లేస్మెంట్ పొందారని ఆయన గుర్తు చేశారు. అన్ని రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీలతో ప్రతినెల జాబ్ ఫెయిర్లు మరియు క్యాంపస్ డ్రైవ్లను నిర్వహించడానికి ప్రయత్నాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరచుకోవడంపై దృష్టి పెట్టాలని, తద్వారా వారు నమ్మకంగా ఇంటర్వ్యూలను ఎదుర్కోగలరని ఆయన నొక్కి చెప్పారు. మిలీనియం డేటా సైన్స్, డేటా అనలిటిక్స్, ఏ డబ్ల్యు ఎస్ , డెవ్ఆప్స్ ఫుల్ స్టాక్స్ వంటి ట్రెండింగ్ కోర్సులను అందిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వీటికి మార్కెట్లో అధిక డిమాండ్ ఉంది, పరిశ్రమ సంపన్నులైన అనుభవజ్ఞులైన అధ్యాపకులు చాలా నామమాత్రపు ధరలకు ఉన్నారు. "భార్గో ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, విశాఖపట్నంలో ప్రముఖ ఐటీ బిజినెస్ సొల్యూషన్స్ ప్రొవైడర్, మంచి కెరీర్ అవకాశాలు ఉన్నాయి" అని ఆయన అన్నారు "భార్గో ఇన్నోవేషన్స్ నుండి అసిస్టెంట్ మేనేజర్ హెచ్ ఆర్ వై. విశ్వనాథ్ రాజు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వెబ్ అప్లికేషన్ డెవలప్మెంట్లో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ హెచ్.ఆర్ మేనేజర్ బి.దివ్య జ్యోతి, హెచ్.ఆర్ ఎగ్జిక్యూటివ్ జి.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు జిమ్ ఎక్విప్మెంట్స్ ఏర్పాటుకు కృషి

93 వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 93వ ప్రహ్లాదపురం స్మశానం దగ్గర ఉన్న ఖాళీ స్థలంలో పార్కు ఏర్పాటు చేసి అందులో జిమ్ ఎక్విప్మెంట్స్ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేయనున్నట్లు స్థానిక కార్పొరేటర్ రాపర్తి కన్నా తెలియజేశారు. 93వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గంగ వరహాలు సూచన మేరకు ఆ ప్రాంతంలో పర్యటించిన కన్నా పార్కు, జిమ్ ఎక్విప్మెంట్స్ ఏర్పాటు చేయడం కోసం సుమారు 500 చదరపు గజాలు స్థలాన్ని లెవెల్ చేయించారు. ఆ పనులను పరిశీలించి, అక్కడ పార్కుతో పాటు జిమ్ ఎక్విప్మెంట్స్ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఆయన వెంట పలువురు ఎన్డీఏ నాయకులు, అధికారులు ఉన్నారు.

పెండింగ్ కేసులు దర్యాప్తు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్లో పెండింగ్లో ఉన్న కేసులు దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలని పోలీసు అధికారులను అదనపు ఎస్పీలు కెవి రమణ, పి . శ్రీనివాసరావు సూచించారు. శనివారం జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పిలు కెవి రమణ, పి. శ్రీనివాసరావు పెండింగ్లో ఉన్న కేసులు, మహిళ సంబంధిత నేరాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, మిస్సింగ్ కేసులు, ఎన్ఫోర్స్మెంట్, లోక్ అదాలత్, రోడ్డు ప్రమాదాలు కేసులపై నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీలు మాట్లాడుతూ గ్రేవ్ కేసులలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై ఛార్జ్ షీట్ దాఖలు కోర్టులో చేయాలన్నారు.ఎస్.సి,ఎస్టి, పోక్సో కేసులలో పారదర్శకంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరగాలని పేర్కొన్నారు. ప్రమాదాలు నివారణకై రోడ్డు భద్రత నియామలపై అవగాహన కల్పించి, ఎక్కువ మొత్తంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు.రోడ్డు ఇరువైపుల ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ప్రజలు సహకారం తో వీలైనంత మేరకు గృహ , వ్యాపార సముదాయాలు, ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అపార్ట్మెంట్స్, టెంపుల్స్ వద్ద వాచ్మెన్లను అప్రమత్తత చేస్తు గస్తీ తిరిగాల్సిన సిబ్బందితో పోలీసు అధికారులు తగిన సూచనలు చేయాలన్నారు. సైబర్ నేరాలు ఎక్కువగా జాబ్ ఫ్రాడ్స్ పై జరుగుతున్నాయని సైబర్ నేరాల, నేరగాళ్ల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నరు.ప్రాపర్టీ నేరాల నివారణకు ప్రణాళిక బద్దంగా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిభకు ప్రశంసా. ప్రాపర్టీ, చైన్ స్నాచింగ్, దొంగతనాలు వంటి కేసులు చేధించడంలో క్రీయ శీలకంగా వ్యవహరించి చాకచక్యంగా ప్రాపర్టీ స్వాధీనం మొదలు అరెస్టు, పోలీస్ సేవలను ప్రజలకు అందించడంలో చేసిన గుడ్ వర్క్స్,ఎన్ బిడబ్ల్యూ అమలు తదితర అంశాలలో ప్రతిభ కనబరిచిన పలువురు పోలీసు అధికారులు సిబ్బందిని అదనపు ఎస్పీలు కేవీ రమణ పి.శ్రీనివాసరావు ప్రశంస పత్రాలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమీక్ష సమావేశంలో డిఎస్పీలు సి.హెచ్. వివేకానంద్, డి ఎస్ ఆర్ వి ఎస్ ఎన్ మూర్తి, వి వి అప్పారావు,ఏ. ఓ సి.హెచ్.గోపీ నాథ్ జిల్లా వ్యాప్తంగా ఉన్న సిఐ, ఎస్ఐ లు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 11న ఐక్యూ నియో 10 ఆర్ లాంచ్

విశాలాంధ్ర/విశాఖపట్నం : యువ యూజర్లు, గేమర్లు, టెక్ ఔత్సాహికుల కోసం రూపొందించిన ఐక్యూ నియో 10ఆర్ను మార్చి 11న విడుదల చేయనుంది. స్నాప్ డ్రాగన్ 8ఎస్ జెన్ 3 ఆపరేటింగ్ సిస్టంపై పనిచేసే ఈ ఫోన్ 1.7ఎంఐం అన్ టుటూ స్కోర్ తో టాప్ టైర్ పెర్ఫార్మెన్స్ ను అందిస్తుంది. గేమర్లు 6043 వేపర్ కూలింగ్ ఛాంబర్, 2000 హెర్ట్జ్ తక్షణ టచ్ శాంప్లింగ్ సహాయంతో 5 గంటల వరకు స్థిరమైన 90 ఎఫ్పిఎస్ అనుభవాన్ని పొందుతారు. ఇది 80వాట్ ఫాస్ట్ ఛార్జింగ్తో భారతదేశ స్లిమ్ 6400 ఎమ్ఏహెచ్ బ్యాటరీ (7.98 మిమీ) కలిగి ఉంది. 1.5కే అమోఎల్ఈడీ డిస్ ప్లే అద్భుతమైన విజువల్స్ను అందించగా, 50 ఎంపీ సోనీ పోర్ట్రెయిట్ కెమెరా, 32 ఎంపీ ఫ్రంట్ కెమెరా హై క్వాలిటీ షాట్స్ను క్యాప్చర్ చేస్తాయి. రేజింగ్ బ్లూ, మూన్ నైట్ టైటానియం రంగుల్లో లభించే ఐక్యూ నియో 10ఆర్ హై పెర్ఫార్మెన్స్ స్మార్ట్ ఫోన్లను పునర్నిర్వచించింది.